
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
శుక్రవారం 2 ఆగస్టు 2024



యువత బంగారు భవిష్యత్‌కు బాటలు : కోమటిరెడ్డి




యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే కార్యక్రమాలకు ఇక్కడ శంకుస్థాపన చేసుకున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. ప్రపంచంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం బాటలు వేసిందన్నారు. మా ప్రభుత్వం.. మాటల ప్రభుత్వం కాదు.. చేతలదని చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు ఇవ్వబోతున్నామని చెప్పారు. పది, పదిహేనేళ్ల పాటు మా ప్రభుత్వం ఇక్కడ ప్రజలకు అండగా ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఏక కాలంలో 31కోట్ల రుణమాఫీ చేశామని, ఆగస్టు 15లోపు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు.

చిగురిస్తున్న ఆశలు

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ సిటీల తరహాలో మరో నగర ఏర్పాటుకు మీర్ఖాన్‌పేట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం అంకురార్పణ చేశారు. దీంతో ఇక్కడి ప్రజలు, యువతలో ఆశలు చిగురిస్తున్నాయి. కాలుష్య రహిత మహానగరి నిర్మాణానికి సర్కార్ తొలి అడుగు వేసింది. ఉపాధి కల్పన కోసం కాలుష్య రహిత పరిశ్రమల కోసం శ్రీకారం చుట్టింది. 57 ఎకరాల విస్తీర్ణంలో 150 కోట్ల అంచనా వ్యయంతో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తుంది. ఫార్మా విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, బ్యాకింగ్, ఫైనాన్స్, రిటైల్, ఈ కామర్స్ లాజిస్టిక్, ప్యాకింగ్, హార్డ్‌వేర్, ఎలక్ట్రిషన్ వంటి 17 రంగాల్లో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్, మూడేళ్ల డిగ్రీ డిప్లొమా సర్టిఫికెట్, ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ యూనివర్సిటీలో ఏటా లక్షమందికి శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బడ్జెట్ సమావేశాల్లో 'యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ బిల్లు 2024 బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించారు. ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు పూర్తి చేసిన యువత రాష్ట్రంలో 30 లక్షల మంది ఉండటంతో వారందరికీ ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు వృత్తి నైపుణ్య శిక్షణ యూనివర్సిటీ ఏర్పాటు అవుతుంది.

స్కిల్ ఇండియాతో యువతకు ఉద్యోగ భద్రత

యూనివర్సిటీ భవనం పూర్తయ్యే వరకు అద్దె భవనంలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్‌రెడ్డి స్కిల్ ఇండియా యూనివర్సిటీకి భూమి పూజ చేయడంతో యువతలో ఆశలు చిగురించాయి. శిక్షణ పొందిన ప్రతి అభ్యర్థికి ఉపాధి, ఉద్యోగ భద్రత కల్పించనున్నట్లు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించటంతో యువతలో మరింత ఊపునిచ్చింది. కాలుష్య రహిత పరిశ్రమలతో పాటు స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, అధునాతన సౌకర్యాలతో టౌన్‌షిప్‌లు ఏర్పాటు కానున్నాయి. ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా మార్పు తీసుకువస్తామన్న హామీ మేరకు ఇక్కడ అనేక ప్రాజెక్టులు రూపుదిద్దుకోనున్నాయి. భూములు కోల్పోయిన రైతులకు సీఎం భరోసా కల్పించారు.



సభకు హాజరైన జనం

అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మీ త్యాగాలకు తగిన ఫలితం

- మహాద్భుతంగా కొత్త నగరం
- భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు అండగా ప్రభుత్వం : సీఎం రేవంత్‌రెడ్డి
- చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి భూమిపూజ చేసిన సీఎం



రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/కందుకూరు/మహేశ్వరం, ఆగస్టు 1 : బేగరకంచ కేంద్రంగా మహానగరాన్ని అద్భుతంగా నిర్మిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కందుకూరు మండలం మీర్ఖాన్‌పేట్‌లోని బేగరకంచలో సీఎం రేవంత్‌రెడ్డి యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్, మోడరన్ స్కూల్, ప్రైమరీ హెల్త్ సెంటర్, కమ్యూనిటీ సెంటర్లకు ఆయన గురువారం సాయంత్రం భూమి పూజచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నెట్ జీరో సిటీ కోసం భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు అండగా ఉంటామని, మీ త్యాగాలకు తగిన ఫలితం ఉంటుందని భరోసా ఇచ్చారు. మీ తాత ముత్తాల భూములు ఈ ప్రాజెక్టు కోసం ఇచ్చారని, మీ కుటుంబాలకు అన్ని రకాలుగా అండగా భద్రతగా ఉంటానని సీఎం తెలిపారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 200 ఫీట్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారుల పనుల పర్యవేక్షణను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి అప్పగిస్తున్నట్లు చెప్పారు. అలాగే రీజనల్ రింగ్‌రోడ్డు భూ సేకరణ బాధ్యతను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అప్పగిస్తున్నట్లు సీఎం ప్రకటించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ భూములు కోల్పోయిన కుటుంబాలకు అండగా ఉంటామని, చదువుకున్న యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వ్యవసాయ భూములు కోల్పోయిన కుటుంబాల్లో చదువుకున్న యువతకు శిక్షణను ఇప్పించి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో గమ్యం తెలియక యువత పోరాటాలు చేసి తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఆమోదింప చేసుకుని ఇక్కడ వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని చెప్పారు. ఫార్మాసిటీ ఏర్పాటైతే ఈ ప్రాంతంలో కలుషిత పరిశ్రమలతో మానవాళి మనుగడగే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండేదన్నారు. అలా కాకుండా మార్పును తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని ఓ మహా నగరంగా తీర్చిదిద్దేందుకు పూనుకున్నామని, ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. నెట్‌జీరో సిటీగా ఉపాధి నిచ్చే పరిశ్రమలే కాకుండా స్పోర్ట్స్ హబ్, ఎడ్యుకేషన్ హబ్, ఆధునిక సౌకర్యాలతో కాలనీలు ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టామన్నారు. పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యం యువతలో లేదనే విషయాన్ని గుర్తించి ఇక్కడ నైపుణ్యాన్ని పెంచే విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీఎం నిర్ణయించినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నోటిఫికేషన్లు ఇచ్చామని, 40వేల మంది యువతకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చినట్లు తెలిపారు. ఇంజనీరింగ్, డిగ్రీలు పీజీలు చేసి 30లక్షల మంది యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని, నైపుణ్యం లేక ఉద్యోగాలు పొందలేకపోతున్నారని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు కేటాయిచామని, ఈ స్థలంలో కార్పొరేట్ స్కూల్, ఆసుపత్రి కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టి మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. నాట్కో సంస్థ ఇక్కడ స్కూల్ ఏర్పాటుకు ముందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు.

ప్రపంచంలో మోడల్‌గా తీర్చిదిద్దుతాం : శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు

మీర్‌ఖాన్‌పేట్‌లో నిర్మించబోయే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రపంచంలోనే మోడల్‌గా తీర్చిదిద్దనున్నట్లు క్రెడాయ్ మాజీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి చెప్పారు. ఈ యూనివర్సిటీలో చేరిన విద్యార్థి ఏ కోర్సులోనైనా నైపుణ్యంతో బయటకు వచ్చేలా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, జిల్లా కలెక్టర్ శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, ఐటీ దిగ్గజం మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, రామ్మోహన్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, కోదండరెడ్డి, తీగల కృష్ణారెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండు రంగారెడ్డి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేష్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో లక్ష మందికి శిక్షణ : శ్రీని రాజు, ఐఎస్‌బీ ఫౌండర్, శ్రీ సిటీ అధినేత

ఏడాదిలో లక్ష మందికి శిక్షణ ఇవ్వబోతున్నామని ఐఎస్‌బీ ఫౌండర్ శ్రీ సిటీ అధినేత శ్రీని రాజు అన్నారు. మూడు వారాల క్రితం వ్యాపారవేత్తలతో సమావేశమై సీఎం మూడు వారాల్లోనే ఇక్కడ అద్భుత ప్రాజెక్టుకు రూపకల్పన చేయడం అద్భుతమైన విషయమన్నారు.

రోడ్డుపైనే విక్రయాలు

- నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు
- కూరగాయలు, మాంసం అమ్మకాలకు ప్రత్యేక చోటులేక వ్యాపారుల అవస్థలు
- ట్రాఫిక్ జామ్‌తో తప్పని ఇబ్బందులు



పిల్లర్ల దగ్గరే నిలిచిపోయిన మార్కెట్ కాంప్లెక్స్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 1 : దినదినాభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నంలో కూరగాయలతో పాటు మాంసం దుకాణాలు, పూలు, పండ్ల విక్రయాలు రోడ్డుపైనే కొనసాగుతుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఏళ్ల తరబడిగా ఈ తంతు కొనసాగుతున్నా.. అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవడం లేదు. ప్రతీ బుధవారం జరిగే సంతతో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా మొదలు తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుకిరువైపులా వస్తు సామగ్రి, కూరగాయల వ్యాపారంతో మరీ ఇబ్బందిగా మారింది. కనీసం వాహనాలు వెళ్లడానికికూడా దారిలేకుండా పోవడంతో సమస్యగా మారింది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద రెండేళ్ల క్రితం రూ.1.06 కోట్ల వ్యయంతో 36 మడిగెలతో కూరగాయల కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినా.. నేటికీ అందుబాటులోకి రాలేదు. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించని కారణంగా భవనాన్ని మున్సిపాలిటీకి అప్పగించలేదు. పక్కనే రూ.4.50 కోట్ల నిధులతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ కాంప్లెక్స్ నిర్మాణం పిల్లర్ల దశలోనే నిలిచిపోయింది. 2022 ఫిబ్రవరిలో నిర్మాణం మొదలుపెట్టినా అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. రోడ్డు మీద కొనసాగుతున్న కూరగాయల విక్రయాలు, మాంసం దుకాణాలను ఒకే చోటకు తీసుకురావాలన్న ఉద్దేశంతో మార్కెట్ నిర్మాణం చేపట్టారు.



రోడ్డుపై కొనసాగుతున్న విక్రయాలు

మున్సిపల్ లెక్కల ప్రకారం 150 పైనే..

మున్సిపల్ లెక్కల ప్రకారం రోడ్డుపై ఉన్న కూరగాయలు, పండ్లు, మాంసం విక్రయాలు, తోపుడు బండ్లపై పూల విక్రయాలు 150కి పైనే జరుగుతున్నాయి. ఆ వ్యాపారులందరినీ ఓ చోటకు చేర్చితే తప్ప.. ట్రాఫిక్ సమస్య తీరదు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాయలం రోడ్డు వరకు, చౌరస్తా నుంచి మంచాల వెళ్లే రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు జరుపుతున్నారు. దాంతో కొనుగోలు దారులు కూడా వాహనాలను రోడ్డుపైనే నిలుపుతుండటంతో వచ్చీపోయే వాహనాలకు ఇబ్బందిగా మారింది.

ఎండ, వానలకు ఇబ్బంది పడుతున్నాం



ఎటూ వీలుగాకే ఏళ్ల తరబడిగా రోడ్డు పక్కన ఎండా వానలకు కూరగాయలు విక్రయిస్తూ ఇబ్బంది పడుతున్నం. మడిగెలు కేటాయిస్తే అక్కడే విక్రయాలు జరుపుతం. మడిగెకు అడ్వాన్సు, ఎక్కువ కిరాయ అంటే కట్టలేం. ఈ విషయంలో అధికారులు తమ పరిస్థితిని అర్థం చేసుకుని కిరాయ నిర్ణయించాలి.

- మైసమ్మ, కూరగాయల విక్రేత

మార్కెట్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయాలి



రోడ్డుపై విక్రయాలను నిరోధించాలంటే త్వరితగతిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేయాలి. గత ప్రభుత్వంలో నిధులు విడుదల చేయకుండా ఆర్భాటంగా పనులు ప్రారంభించగా కాంట్రాక్టరు పల్లర్ల వద్దే పనులు ఆపేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి నిధులు విడుదల చేయాలి.

- జక్క రవీందర్‌రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు

మార్కెట్ మడిగెలను త్వరలో కేటాయిస్తాం



పాత పోలీస్ క్వార్టర్స్ వద్ద నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ మడిగెలను త్వరలోనే కూరగాయల విక్రయదారులకు కేటాయిస్తాం. కాంట్రాక్టరుకు బిల్లులు చెల్లించే విషయంలో ప్రణాళిక రూపొందిస్తున్నాం. కాగా, మడిగెలు తక్కువగా ఉండడం.. పోటీ ఎక్కువగా ఉన్నందున కౌన్సిల్‌లో చర్చించి లాటరీ పద్ధతిన వ్యాపారులకు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- రవీందర్ సాగర్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హిడెన్ డిజబిలిటీస్ సన్‌ఫ్లవర్ ప్రోగ్రాం

- కంటికి కనిపించని వైకల్యం ఉన్నవారి సౌకర్యార్థం జీఎంఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటు



శంషాబాద్ రూరల్, ఆగస్టు 1 : కంటికి కనిపించని వైకల్యం ఉన్న ప్రయాణికుల కోసం జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం గురువారం హిడెన్ డిజబిలిటీస్ సన్‌ఫ్లవర్ ప్రోగ్రామ్‌కు శ్రీకారం చుట్టింది. తక్కువ దృష్టి, ఆటిజం, చిత్తవైకల్యం, మేథో వైకల్యం లేదా వినికిడి లోపం లాంటి కంటికి కనిపించని వైకల్యాలు ఉన్న ప్రయాణికులకు ప్రయాణ అనుభవాలను మెరుగుపర్చేందుకు జీఎంఆర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రయాణికులు ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడిన సన్‌ఫ్లవర్ ట్యాగులను ధరించడం ద్వారా వారి సహాయ అవసరాన్ని తెలివిగా సూచించవచ్చు. ఇది అదనపు సహాయం లేదా సమయాన్ని అందించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది. ఈ ట్యాగ్ వేగవంతమైన సేవలకు హామీ ఇవ్వదు కానీ.. విమానాశ్రయం సిబ్బందికి దృశ్య సూచనగా పని చేస్తుందని జీఎంఆర్, ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో లేదా విమానాశ్రయం యొక్క సమాచారాన్ని, డెస్క్‌లో ప్రయాణ వివరాల ఫారాన్ని పూర్తి చేసేందుకు అవకాశం కల్పిస్తుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ హైదరాబాద్ విమానాశ్రయంలో హిడెన్ డిజబిలిటీస్ సన్‌ఫ్లవర్ ప్రోగ్రామ్‌ను ప్రవేశపెట్టడంతో ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. అన్ని ప్యాసింజర్ ఇంటరాక్షన్ పాయింట్ల దగ్గర సిబ్బందికి శిక్షణతో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. 2016లో యునైటెడ్ కింగ్‌డమ్ ప్రారంభించిన సన్‌ఫ్లవర్ ట్యాగ్‌ను ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 200 విమానాశ్రయాలు రవాణా వ్యవస్థలో ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లి పాలతో శిశువుల్లో రోగ నిరోధక శక్తి

- సీడీపీవో నాగమణి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగమణి

కేశంపేట, ఆగస్టు 1: తల్లిపాలతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, తల్లి కూడా ఆరోగ్యంగా ఉటుందని షాద్‌నగర్ ప్రాజెక్ట్ సీడీపీవో నాగమణి వివరించారు. పాపిరెడ్డిగూడలో గురువారం ఐసీడీఎస్, జిమ్స్ హోమియోపతి వైద్య కళాశాల, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేపటి సమాజం కోసం పౌరులు ఆరోగ్యంగా ఉండాలంటే తల్లులు తమ శిశువులకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. అంతకు ముందు జీమ్స్ వైద్యురాలు రమ్యకృష్ణ మాట్లాడుతూ.. గర్భిణులు ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. ప్రసవానంతరం బాలింతలు శిశువులకు పాలు ఇవ్వాలన్నారు. ముర్రు పాలనలో శిశువుకు రోగనిరోధక శక్తి లభిస్తుందన్నారు. తల్లి పాలిస్తే తల్లికి బిడ్డలకు బంధం పెరుగుతుందన్నారు. అంతేకాకుండా పాలిచ్చే తల్లులకు రొమ్ము క్యాన్సర్ ప్రమాదం తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, కేశంపేట. సూపర్‌వైజర్లు దివ్య సింగ్, శమంతకమణి, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

గ్రామాల్లో బోనాల ఉత్సవాలు



అమ్దాపూర్‌లో బోనాలతో తరలుతున్న మహిళలు

ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు గురువారం మండలంలోని పలు గ్రామాల్లో వైభవపేతంగా జరిగాయి. మహిళలు బోనాలనె ఎత్తుకొని గ్రామ దేవతల ఆలయాలకు చేరుకొని పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అమ్దాపూర్, కాశీంబౌళి, బాకారంజాగీర్, చిన్నమంగళారం, అప్పోజిగూడ, వీరన్నపేట, ఎల్కగూడ గ్రామాల్లో బోనాల పండుగను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో బీజేపీ ఓబీసీ వింగ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్లని వెంకటేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు మహేందర్, మాజీ సర్పంచ్‌లు కొత్తపల్లి రాఘవరెడ్డి, రవళిగోపీకృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్, జయరాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, నాగార్జునచారి, వినయ్ రెడ్డి, రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 1





బాకారం జాగీర్‌లో బోనాల ఉత్సవాలు

తాండూరులో ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

బీజేపీ నేత యు.రమేష్‌కుమార్



మాట్లాడుతున్న రమేష్‌కుమార్

తాండూరు రూరల్, ఆగస్టు 1: తాండూరులో ఈఎస్‌ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యు.రమేష్‌కుమార్ అన్నారు. తాండూరు పట్టణ బీజేపీ కార్యాలయంలో గురువారం బీజేపీ కార్యనిర్వాహక సభ్యులు శేఖాపురం ఆంజనేయులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు ప్రాంతంలోని నాపరాతి గనులు, సుద్ధ గనులు వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయని, వాటిలో వేలాది మంది కార్మికుల పనిచేస్తున్నారని అన్నారు. వారికి వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం వెంటనే ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, వైద్యం, విద్యుత్, ఆరోగ్యం వంటి సమస్యలతో ప్రజలు అనే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు శేఖాపురం ఆంజనేయులు మాట్లాడుతూ.. తాండూరులో నిరుద్యోగ సమస్య ఉందని, సీసీఐ కర్మాగారాలు ఉన్నప్పటికీ నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరకడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీవీ బసవరాజ్, మండల అధ్యక్షుడు ప్రభుశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, అసెంబ్లీ కన్వీనర్, రజనీకాంత్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీహరి, బీజేపీ నాయకులు వడ్ల విజయ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సర్టిఫికెట్ల జారీ అధికారం ఎమ్మార్వోలకే ఇవ్వాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 1: వారసత్వ సర్టిఫికెట్లు జారీ చేసే అధికారం మండల ఎమ్మార్వోలకే ఇవ్వాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం శాసన మండలిలో ఆయన మాట్లాడారు. వారసత్వ సర్టిఫికెట్లను గతంలో ఎమ్మార్వోలే ఇచ్చేవారని, ప్రస్తుతం అట్టి అధికారం కోర్టులకు అప్పగించారని గుర్తుచేశారు. వారసత్వ సర్టిఫికెట్ కోసం కోర్టుకు వెళితే అధిక డబ్బుతో పాటు కాలయాపన జరుగుతున్నదన్నారు. ప్రమాదాలకు గురవుతున్న పేదలు ఆర్థిక సమస్యలతో సరైన వైద్యం పొందలేక ప్రాణాలు కోల్పోతున్నారని, పట్టణాల్లోని ప్రతీ ప్రైవేట్ ఆసుపత్రికి ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసి, క్షతగాత్రుల ప్రాణాలను కాపాడాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల ముందు, ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సైతం ప్రతీ రైతుకు రెండు లక్షల వరకు పంట రుణాన్ని మాఫీ చేస్తామన్న ప్రభుత్వం.. ఇప్పుడు కుటుంబానికి రెండు లక్షలు, రేషన్ కార్డు ఉండాలంటూ తప్పించుకునే ప్రయత్నం చేయవద్దని కోరారు. రేషన్ కార్డు, కుటుంబంతో సంబంధం లేకుండా ప్రతీ రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

'అనురాగ్' విద్యార్థులకు ఇండియా డిజైన్ వీక్-2024 అవార్డు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు

ఘట్‌కేసర్‌రూరల్, ఆగస్టు 1: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ విద్యార్థులకు ఇండియా డిజైన్-2024 వీక్ స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. అనురాగ్ యూనివర్సిటీ మెకానికల్ విభాగానికి చెందిన విద్యార్థులు మహేష్, కౌశిక్, చరణ్‌సన్నీ, నజీద్‌లు చెన్నైలో జరిగిన ఇండియా డిజైన్-2024 కాంపిటీషన్‌లో పాల్గొని తయారు చేసిన 'వాటర్ గార్బేజ్ కలెక్టర్ డిజైన్ చేశారు. ఇందుకు గానూ స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. దీంతో స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయ్‌కుమార్, మెకానికల్ హెచ్‌వోడీ శ్రీనివాస చలపతి, అధ్యాపకులు జూష్‌కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.

హోంగార్డుకు రివార్డు

యాచారం, ఆగస్టు 1: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో ఇటీవల మహిళపై అత్యాచారం చేసి పరారైన నిందితుడిని మాల్‌లో హోంగార్డు మహేందర్ పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. హోంగార్డుకు సీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం రూ.3వేల నగదు రివార్డు అందించారు.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

» భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదేజోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది.

ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దేశంలో 422.8 మి.మీ వర్షపాతం (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 106 శాతం) నమోదవుతుందని తాజా బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టులో దేశంలో 254.9 మి.మీ. (1971 నుంచి 2020 వరకు నమోదైన వర్షపాతం సగటులో 94 నుంచి 106 శాతం వరకు) నమోదు కానుంది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర కోస్తాలోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

» సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన

» జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి

» 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని ఆశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

» ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!

» జూలై 13న గాజాలో అంతం చేశాం

» ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం

» ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.





కర్ణాటక సీఎంకు గవర్నర్ నోటీసుపై మంత్రివర్గం అభ్యంతరం

» వెనక్కి తీసుకోవాలని ఏకగ్రీవ తీర్మానం

బెంగళూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు అవినీతి వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ నోటీసులు జారీ చేయడంపై మంత్రి వర్గం తీవ్ర అభ్యంతరం తెలిపింది. విధానసౌధలో గురువారం సీఎం సిద్దరామయ్య లేకుండా డీసీఎం డీకే శివకుమార్ అధ్యక్షతన క్యాబినెట్ భేటీ జరిగింది. ముడా అవినీతికి సంబంధించి గవర్నర్ జారీ చేసిన నోటీసులు వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ విషయాన్ని సహకార శాఖ మంత్రి రాజణ్ణ మీడియాకు తెలిపారు. సీఎం సిద్దరామయ్యకు రాజభవన్ నుంచి వచ్చి న షోకాజ్ నోటీసు గురించి చర్చించామని, న్యాయపోరాటం చేయాలని తీర్మానించామని చెప్పారు. గవర్నర్ జారీ చేసిన నోటీసును వాపసు తీసుకోవాలని క్యాబినెట్‌లో తీర్మానించామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి గవర్నర్ నోటీసు జారీ చేయడం రాజకీయ ప్రేరేపితమని ఆరోపించారు. నోటీసులు తిరస్కరించాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన తెలిపారు.

ఉత్తరాది అతలాకుతలం

» హిమాచల్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కుంభవృష్టి!

» 50 మంది గల్లంతు.. ఐదుగురి దుర్మరణం

» ఉత్తరాఖండ్‌లో రాత్రివేళ పోటెత్తిన వరద

» రాష్ట్రవ్యాప్తంగా వర్షాలకు 12మంది మృతి



వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

శిమ్లా, డెహ్రాడూన్, జైపూర్, ఆగస్టు 1: ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్‌లో క్లౌడ్ బరస్ట్‌తో కులు, పధార్, మండి, శిమ్లా జిల్లాలను వరద ముంచెత్తింది. 50 మంది గల్లంతవగా.. వీరిలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు, బ్రిడ్జిలు, రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. శ్రీఖండ్ మహదేవ్ సమీపంలో బుధవారం రాత్రి క్లౌడ్ బరస్ట్‌తో సర్పారా, గాన్వీ, కుర్బన్ నల్లాల్లో మెరుపు వరదలు సంభవించాయి. పార్వతి నదిపై మలానా డ్యామ్ కొట్టుకుపోయి దిగువ ప్రాంతాలను నీరు ముంచెత్తింది. శిమ్లా జిల్లా రాంపూర్‌లోని సమేజ్‌ఖడ్‌లో 30 మంది కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరు మృతిచెందారు. మండి జిల్లా తెరాంగ్ సమీపంలోని రాజ్‌బన్ గ్రామం వద్ద మరో క్లౌడ్ బరస్ట్ జరిగింది. ఏడుగురు గల్లంతవగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. కాగా, ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం న మోదైంది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరు చోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.


పార్లమెంట్ పైకప్పు లీకేజీ

» బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు

» లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం



న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటుచేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రెటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేందర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.





ప్రజాసేవ చేసేవారికి దైవాశీస్సులు

● పోతాయిపల్లి నుంచి అయోధ్యకు బీజేపీ నాయకుల సైకిల్ యాత్ర

● ప్రారంభించిన ఎంపీ ఈటల సతీమణి జమున



జెండాఊపి సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్న ఈటల జమున

శామీర్‌పేట, ఆగస్టు 1: నిరంతరం ప్రజాసేవ చేసే వారికి దైవాశీస్సులు, అనుగ్రహం ఎప్పటికీ ఉంటాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల సతీమణి ఈటల జమున అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని పోతాయిపల్లిలో గల శ్రీరామభద్రక్షేత్రం వద్దకు గురువారం ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తూంకుంట నుంచి అయోధ్యకు వెళ్లే సంకల్ప సైకిల్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. సైకిల్‌యాత్ర దిగ్విజయం అయ్యేందుకై శ్రీరామభద్ర ఆలయంలో వేదాంత బ్రహ్మణ పండితుడు పందరీ సంతోష్‌కుమార్ ప్రత్యేక సంకల్ప పూజ, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల జమున మాట్లాడుతూ.. 4 లక్షల మెజార్టీతో ఎంపీగా ఈటల రాజేందర్ గెలుపొందితే బీజేపీ కార్యకర్తలు, అభిమానులు సైకిల్‌యాత్రను నిర్వహిస్తామని ఇక్కడి శ్రీరామభద్ర ఆలయంలో మొక్కుకున్నట్లు తెలిపారు. దైవానుగ్రహంతో, ఆశీస్సులతో తన భర్త ఈటల రాజేందర్ అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలుపొందారని తెలిపారు. ప్రజలకు సేవ చేసేవారు ఎప్పటికీ ఉన్నత స్థానంలో ఉండేందుకు ఎదుగుతారని ఆమె వివరించారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాన్ని ప్రజల సహకారంతో, భగవంతుని ఆశీస్సులతో రాజకీయాలకతీతంగా అన్నిరంగాల్లో ఉత్తమ అభివృద్ధి పనులను చేపట్టడమే ఎంపీ ఈటల రాజేందర్ ధ్యేయమని, తమ ఆశయమని ఆమె వెల్లడించారు. బీజేపీ కార్యకర్తలు చేపట్టిన సైకిల్‌యాత్ర విజయవంతం కావాలని శ్రీరామభద్రుడ్ని వేడుకుంటున్నట్లు ఆమె చెప్పారు. కాగా తూంకుంటకు చెందిన బీజేపీ కార్యకర్తలు కాసుల కరుణాకర్, కాసుల సుభాష్‌చంద్రబోస్, రాజారెడ్డి, హుజురాబాద్‌కు చెందిన మరో ఇద్దరు పార్టీ కార్యకర్తలు సంకల్పయాత్రగా సైకిళ్లపై తూంకుంట నుంచి అయోధ్యకు బయల్దేరారు. 15 రోజుల నుంచి 20రోజుల వరకు ఈ అయోధ్య సంకల్పయాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకుని అయోధ్యలో శ్రీరాముడి దర్శనం చేసుకుని వస్తామని కాసుల కరుణాకర్, సుభాష్‌చంద్రబోస్, రాజారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కాసుల నర్సింగ్‌రావుగౌడ్, కాసుల ఈశ్వర్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణపై తీర్పు సంతోషకరం

అసెంబ్లీలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య



చేవెళ్ల, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై కృతజ్ఞతలు చెబుతున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగ, మాదిగ ఉపకులాల ఏవర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం చేసిన మాదిగ అమరులకు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ముందుండి పని చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్లలో మాదిగలు, మాదిగ ఉపకూలాలాలకు ఉద్యోగాలు, విద్యా సంస్థల అడ్మిషన్లలో ప్రాముఖ్యత కల్పించాలని కోరారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 1: కందుకూరు మండల పరిధిలోని నేదునూరు మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వందేమాతరం విద్యార్థి సేవా ఫోర్స్ అధ్యక్షుడు ఊటు మహేందర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంకను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేదునూరు మోడల్ స్కూల్, కళాశాల వరకు రోడ్డు మంజూరు చేయడంతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని కోరినట్లు తెలిపారు. కందుకూరు మండలంలోని అన్ని గ్రామాలకు బస్సుల సౌకర్యాలు పెంచాలన్నారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ డీఈవోకు విషయం చెప్పారు. దీనితో పాటు కావాల్సిన మౌలిక వసతులను తొందరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పుచ్చల విష్ణు, రమేశ్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఎర్రమట్టి తరలింపు

మొయినాబాద్, ఆగస్టు 1 : మండల పరిధిలోని పెద్దమంగళారం రెవెన్యూలోని ప్రభుత్వ భూమిలోంచి అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నారు. పెద్దమంగళారం-చందానగర్ వెళ్లే రోడ్డు పక్కన సర్వేనెంబర్ 218 ప్రభుత్వ భూమి నుంచి కొంతమంది అక్రమార్కులు ఎర్రమట్టి తలిస్తున్నారు. రెండు రోజులుగా ఎర్రమట్టి తలిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వ భూమిలోంచి దొంగతనంగా మట్టిని జేసీబీతో తవ్వి టిప్పర్‌లో తరలిస్తున్నారు. ఎక్కడి తీసుకెళుతున్నారని అడిగితే డ్రైవర్లు చెప్పడం లేదని గ్రామస్తులు చెప్పారు. అధికారులు స్పందించి మట్టి తరలింపును ఆపాలని కోరుతున్నారు.

భగ్గుమన్న బీఆర్‌ఎస్

శాసన సభలో బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా గురువారం బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తదితర నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాన రహదారులపై బైటాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కార్యకర్తలు తదితతరులు పాల్గొన్నారు.


షాబాద్ : కంది-షాద్‌నగర్ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, తదితరులు


కందుకూరు : మండల కేంద్రంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్, నాయకులు


కడ్తాల : ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ తదితరులు


చేవెళ్ల : హైదరాబాద్-బీజాపూర్ హైవేపై సీఎం దిష్టిబొమ్మతో ధర్నా చేస్తున్న ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు


శంషాబాద్ : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న హనుమంతు, తదితరులు


శంకర్‌పల్లి : బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై సర్వత్రా హర్షం

- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు
- ప్రధాని మోదీ, మంద కృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి, బాణ సంచాలను కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. నాయకులు రవికుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండలం కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. పోతుగంటి కృష్ణమాదిగ, లలితజ్యోతయ్య, రామచంద్రయ్య, కిరణ్‌మాదిగ, తదితరులున్నారు.

యాచారం : ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లుగా తాము చేస్తున్న పోరాటాన్ని సుప్రీం కోర్టు గుర్తించి ఎస్సీ వర్గీకరణ చేయాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించడం సంతోషదాయకమని యాచారం మండల ఎమ్మార్పీఎస్ నాయకులు బోడకృష్ణ, లింగం తదితరులు అన్నారు. మాల్‌లో సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో బీజేపీ సీనియర్ నాయకులు మేకల యాదగిరిరెడ్డి, మండల అధ్యక్షుడు తాండ్రరవీందర్‌ల ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నందివనపర్తి మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, నాయకులు గొల్లపల్లి జంగయ్యగౌడ్, తదితరులున్నారు.


తలకొండపల్లి : మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


యాచారం : ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కేశంపేట : కేంద్ర ప్రభుత్వ చొరవతోనే ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించిందని, ఇది మాదిగల ఉపకులాలకు ఎంతగానో ఉపయోగపడుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు రఘురాములు గౌడ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ, పోమాల్‌పల్లి మహేష్‌లు ఓ ప్రకటనలో తెలిపారు.

షాద్‌నగర్ అర్బన్ : ప్రధాని ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య పేర్కొన్నారు. మంద కృష్ణమాదిగ డిమాండ్ మేరకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించడంతోనే సుప్రీంకోర్టు తీర్పు వచ్చిందని తెలిపారు. మోదీకి బాబయ్యతో పాటు బీజేపీ ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

మొయినాబాద్ : ఎస్సీ వర్గీకరణ బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగిస్తూ సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మసనం తీర్పు నివ్వడం హర్షించదగ్గ విషయమని పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం చేస్తూ ఎంతో మంది అమరులైనారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ అమలు చేస్తుందన్నారు.

చేవెళ్ల : సుప్రీకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆలూర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు, పార్టీల నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వెంకటేశ, తోట చంద్రశేఖర్, ఆశోక్, శంకరయ్య, నర్సింలు, రమేశ్, యాదయ్య, జంగయ్య, తదితరులున్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన 30 ఏళ్ల పోరాటానికి న్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్ అన్నారు. పట్టణ కేంద్రంలో యాదయ్య సమక్షంలో ఎమ్మార్పీఎస్ నాయకులు హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సత్యనారాయణ, పెంటయ్య, వెంకటయ్య, ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.


షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ చౌరస్తాలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

శంషాబాద్ : మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటం ఏర్పాటుచేసి పాలాభిషేకం చేశారు. మిఠాయిలు పంచిపెట్టి బాణసంచా కాల్చి పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. నాయకులు మదిలేటి మాదిగ, నర్సింహ మాదిగలు మున్సిపాలిటీ, మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కందుకూరు : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కంద పెద్ద నర్సింహ ఆధ్వర్యంలో నాయకులు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కె.జంగయ్య, కె.నర్సింహ, కె.రవి, నవీన్‌కుమార్, కె.అశోక్, తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : ఆలూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా బోనాలు


మొయినాబాద్ : కేతిరెడ్డిపల్లిలో నిర్వహించిన బోనాల ఊరేగింపులో ఆకట్టుకున్న బోనం

మొయినాబాద్, ఆగస్టు 1 : మండలంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పెద్దమంగళారంలో గడి మైసమ్మకు, కట్టమైసమ్మకు బోనాలు సమర్పించారు. కేతిరెడ్డిపల్లిలో మైసమ్మకు బోనాలు సమర్పించారు. మండలంలోని వివిధ గ్రామల్లో బోనాల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గ్రామపెద్దలు తదితరులున్నారు.

చేవెళ్ల : ధర్మసాగర్, రావులపల్లిలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉదయం నుంచి రాత్రి వరకు ఆనందంగా గడిపారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బోనాల ఊరేగింపు పోతురాజుల విన్యాసం, డప్పు వాయిద్యాలతో కనుల పండువగా సాగింది. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


శంషాబాద్ : కూరగాయల మార్కెట్‌లో పోచమ్మతల్లి ఆలయంలో తొట్టెల సమర్పించిన కమిటీ సభ్యులు

శంషాబాద్ : శంషాబాద్ కూరగాయల మార్కెట్‌లో గురువారం సాయంత్రం బోనాలు నిర్వహించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతియేటా బోనాల ఉత్సవం నిర్వహిస్తారు. కూరగాయల మార్కెట్‌లో ప్రతీ మోండాదారుడు, అడ్డీదారులు బోనాలు అందంగా అలంకరించి పోచమ్మ దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఆ తరువాత కమిటీ సభ్యులంతా కలసి సామూహికంగా తొట్టెలను మార్కెట్‌లోని రోడ్ల వెంట ఊరేగించిన అనంతరం అమ్మవారి దేవాలయంలో సమర్పించారు. ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బాల్‌రాజ్‌తో పాటు సిబ్బందిని మార్కెట్ కమిటీ సభ్యులు సన్మానించారు. సుభాష్‌రెడ్డి, జీబీ. సంజీవరావు, కొనమొల్ల దేవేందర్, శివశంకర్, సిద్దులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల : ధర్మసాగర్‌లో బోనాలు ఊరేగింపు

సబితాఇంద్రారెడ్డి దిష్టిబొమ్మ దహనం!

కందుకూరు, ఆగస్టు 1: బీఆర్‌ఎస్ నాయకులు చేపట్టిన నిరసనకు పోటీగా కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు కృష్ణానాయక్, సరికొండ జగన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన కార్యక్రమంలో పీసీసీ సభ్యులు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పాండురంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, ఎగ్గిడి కృష్ణ, గణేష్, రాంరెడ్డి, ప్రశాంత్‌కుమార్, జైపాల్‌రెడ్డి,.వినోద్‌చారి, శ్రీనివాస్‌నాక్, బాలునాయక్ తదితరులున్నారు.


కందుకూరు : సబిత దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నించిన నాయకులను వారిస్తున్న పోలీసులు

హార్టికల్చర్ అధికారిగా హిమబిందు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 1: షాద్‌నగర్ హార్టికల్చర్ అధికారి ఉషారాణి బదిలీ అయ్యారు. 12 సంవత్సరాలుగా షాద్‌నగర్‌లో పని చేస్తున్న ఉషారాణి డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ హైదరాబాద్ ఆఫీసుకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ హార్టికల్చర్ అధికారిగా జడ్చర్ల నుంచి హిమబిందు బదిలీపై రానున్నారు.



రుణమాఫీ చరిత్రాత్మక నిర్ణయం

కడ్తాల్, ఆగస్టు 1: రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయడం సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయమని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం రైతులకు రెండో విడత రూ. 1.50 లక్షల రుణమాఫీని హర్షిస్తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో కాంగ్రెస్ నేతలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహ

సంక్షిప్తంగా..

కడ్తాల్ : రావిచెడ్ గ్రామ పంచాయతీ మద్దెల కుంట తండాలో కొంతకాలంగా రైతులు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో అధికారులను సంప్రదించారు. 4 ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర మెటీరియల్‌ను ఇప్పించారు.

చౌదరిగూడ : ఉపాధిహామీలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన 2023-24 పనులపై సోషల్ ఆడిట్ అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల డబ్బుల చెల్లింపులపై ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఆరా తీశారు.

చౌదరిగూడ : కేసీఆర్‌తోనే తెలంగాణలోని తండాలు ఎంతో అభివృద్ధి చెందాయని జిల్లేడ్ చౌదరిగూడ మండల ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తండాలను అభివృద్ధి పరిచేందుకే గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దిన విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచి పోయారని ఎద్దేవా చేశారు.

కడ్తాల్ : బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత కాలం సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లుల గురించి ఏనాడూ నోరుమెదపని కడ్తాల మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డికి ప్రభుత్వం మారాక మాజీ సర్పంచ్‌లు, వారి బాధలు గుర్తొస్తున్నాయని కడ్తాల మండల మాజీ సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ అధిష్ఠానం మెప్పు, స్వప్రయోజనం కోసం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం పేరుతో లక్ష్మీనర్సింహారెడ్డి సాగిస్తున్న రాజకీయ ఎత్తుగడలు మాజీ సర్పంచ్‌లు నమ్మే స్థితిలో లేరని అన్నారు. పెండింగ్ బిల్లులకు గత ప్రభుత్వం కారణం కాబట్టి సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ భవన్ ఎదుట నిరసన చేపట్టాలని హితవు పలికారు. సర్పంచ్‌ల సంఘం పేరుతో పెండింగ్ బిల్లుల కోసం నేడు(శుక్రవారం) సచివాలయం ఎదుట నిరసన దీక్ష కు పిలుపునివ్వడం సరికాదన్నారు.

నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చర్యలు

కొత్తూర్/షాద్‌నగర్‌రూరల్, ఆగస్టు 1:నిషేధిత గుట్కాలు విక్రయిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ నర్సింహారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పాన్‌షాపులు, కిరాణ దుకాణాలు, లాడ్జీలను గురువారం సాయంత్రం పోలీసులు తనిఖీ చేశారు. లాడ్జీల యాజమానులు పూర్తిస్థాయిలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. ఎస్‌ఐ జి.శ్రీనివాస్, ఏఎస్‌ఐ వెంకటేష్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలలో నిబంధనలు పాటించాలని, లేనియెడల యజమానులపై చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. పట్టణ పరిసరాల్లోని పలు లాడ్జీలను గురువారం రాత్రి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. లాడ్జీల్లో బసచేసే వారి వివరాలు విధిగా సేకరించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ పత్రాలుంటేనే అనుమతించాలని, వివరాలు రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. సీసీ కెమెరాలు పని చేసేలా చూసుకోవాలని అన్నారు. తనిఖీల్లో ఎస్సై సుశీల తదితరులున్నారు.


కొత్తూర్ : పాన్‌షాపును తనిఖీ చేస్తున్న పోలీసులు

క్రైం కార్నర్

తండ్రి మందలించాడని.. ఇంట్లోంచి వెళ్లిపోయిన యువకుడు

- పోలీసులకు ఫిర్యాదు.. మిస్సింగ్ కేసు నమోదు


కేతావత్ బబ్లు

కేశంపేట, ఆగస్టు 1: తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయడు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్లాస్‌ఖాన్‌పేట జీపీ పోడగట్ట తండాకు చెందిన కేతావత్ బబ్లు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. జూలై 29న ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి వెళ్లి అదే రోజు రాత్రి 7గంటలకు తిరిగి వచ్చాడు. ఉదయం ఇంట్లో అన్నం తినకుండా వెళ్లి, పనికి కూడా వెళ్లలేదని తండ్రి రవీందర్ మందలించాడు. బబ్లు అదేరోజు రాత్రి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం రవీందర్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బబ్లు ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో బ్లూ కలర్ జీన్స్, వైట్ కలర్ షర్టు, ధరించాడని, ఛామనచాయ రంగు ఉండి. 5.8 ఎత్తు ఉంటాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440904759 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం

శంషాబాద్ రూరల్, ఆగస్టు 1 : డిగ్రీ చదివే యువతి అదృశ్యమైన ఘటన గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తొండుపల్లికి చెందిన రజిత జూలై 30న బోనాల కోసం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అదృశ్యమైన యువతి శంషాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఫస్టియర్ చదువుతోందని తెలిపారు.

తెగిపడిన విద్యుత్ లైన్.. గృహోపకరణాలు ధ్వంసం

ఆమనగల్లు, ఆగస్టు 1 : ఆమనగల్లు పట్టణంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన ఉన్న 33 కేవీ విద్యుత్‌లైన్ తెగిపడడంతో రెండిళ్లలో గృహోపకరణాలు ధ్వంసమైనాయి. ఈ ప్రమాదంలో వైర్ తెగిపడిన చోట మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిన ఘటన గురువారం జరిగింది. ఆమనగల్లులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సూర్యలక్ష్మి కాటన్‌మిల్లుకు విద్యుత్ సరఫరా కోసం 33 కేవీ లైన్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భారత్ పెట్రోల్ బంకు సమీపంలో కావటి కొండాల్ ఇంటి ముందు 33 కేవీ విద్యుత్ వైర్ తెగిపడింది. దాంతో కొండల్ ఇంట్లో టీవీ, రిఫ్రిజిరేటర్, స్విచ్‌బోర్డులు కాలిపోయాయి. రోడ్డు పక్కన ఉన్న భూషణ్ హోటల్ రిఫ్రిజిరేటర్‌తో పాటు స్విచ్‌బోర్డులు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో రిఫ్రిజిరేటర్ తెరవకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని ఆయన ఆందోళన చెందాడు. ఏఈ సీతారాములు పరిశీలించారు. తెగిపడిన వైర్‌ను అతికించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

సెల్‌ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత

కేశంపేట, ఆగస్టు 1: కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్‌లను రికవరీ చేసినట్లు ఎస్సై రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నాలుగు సెల్‌ఫోన్‌లు రికవరీ చేసి బాధితులకు అందించినట్లు వివరించారు.

పంటల నమోదు వేగవంతం చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డీఏవో గీతారెడ్డి

కొందుర్గు, ఆగస్టు, 1: మండలంలో పంటల నమోదు, వన మహోత్సవ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కొందర్గులోని అయ్యప్ప ట్రేడర్స్ షాపును, ఆగ్రో రైతు సేవా సెంటర్‌ను, వెంకిర్యాలలోని ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం రైతువేదికలో రైతులు, సిబ్బందితో మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఉదయం తప్పకుండా గ్రామాల్లోకి వెళ్లి పంటల నమోదును చేయాలని, మధ్యాహ్నం ఒంటి గంటకు రైతు వేదికకు వచ్చి, రైతు బీమా, రుణమాఫీ విషయాలపై రైతులతో మాట్లాడి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. రోజూ బ్యాంకులకు వెళ్లి రుణమాఫీ అయిన రైతులకు కొత్తగా రుణాలు ఇప్పించాలని సూచించారు. ప్రతీ ఏఈవో టార్గెట్ ప్రకారం మొక్కలను నాటించాలని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జూన్ 28వ తేదీ వరకు కొత్త పట్టాదార్ పాసుబుక్కు తీసుకున్న రైతులు ఈ నెల 5వ తేదీ వరకు తమ ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డును తెచ్చి రైతు బీమాకు నమోదు చేయించుకోవాలని తెలిపారు. కొందరు రైతుల రుణమాఫీ ఇంకా కాలేదని విలేకరులు అడుగగా ఈ విషయంపై షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శ్రద్ధ తీసుకుంటున్నారని, ఒకటి రెండు రోజుల్లో 576 మంది రైతులకు లక్ష రుణమాఫీ అవుతుందని డీఏవో తెలిపారు. కొందుర్గు ఇన్‌చార్జి ఏవోగా రవినాథ్‌ను నియమించామని తెలిపారు. షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం, ఏఈవోలు అనూష, వాసవి, కొటేశ్వర్ ఉన్నారు.

పంటల సాగులో మెళకువలు పాటించాలి

ఆమనగల్లు, ఆగస్టు 1: పంటల సాగులో రైతులు తగిన మెళకువలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి కోరారు. జంగారెడ్డిపల్లి, శెట్టిపల్లి, చెన్నంపల్లిలో గురువారం ఏవో పర్యటించి వరి, పత్తి, జొన్న, మొక్క జొన్న తదితర పంటలను పరిశీలించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల బెడదను గమనించి నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.

'ఈ-సమృద్ధి'లో పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

కేశంపేట : ఈ-సమృద్ధిలో రైతులు పంటల వివరాలు నమోదు చేసుకోవాలని నాఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రేమ్‌కుమార్, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ జిల్లా కో-ఆర్డినేటర్ శేఖర్‌లు తెలిపారు. మండల పరిధిలోని సంగెం, ఎక్లాస్ ఖాన్‌పేట గ్రామాలలో గురువారం పంటల వివరాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. రైతుల ఈ-సమృద్ధిలో వివరాలు నమోదు చేస్తే నాఫెడ్ ద్వారా నేరుగా పంటలను కొనుగోలు చేస్తామని తెలిపారు. దాంతో రైతులకు ట్రాన్స్‌పోర్ట్, హమాలీల ఖర్చులు తగ్గుతాయని, బహిరంగ మార్కెట్‌లో ఎక్కువ గిట్టుబాటు ధర వస్తే రైతుల అక్కడే అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీసీ యాదయ్య, ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ విజయ, సీఈవో లక్ష్మణ్, ఏపీఎం భగవంతు, భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువుకు ముర్రుపాలు పట్టించాలి

కేశంపేట/కొందుర్గు, ఆగస్టు 1: అప్పుడే పుట్టిన(నవజాత) శిశువుకు తల్లి ముర్రుపాలు పట్టించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి సూచించారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని తెలిపారు. డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, ఎంపీహెచ్‌వో ఉపేందర్ రెడ్డి, పీహెచ్‌ఎన్ అంజలమ్మ, స్టాఫ్ నర్స్ హేమలత, చంద్రశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, తల్లిపాలతో పిల్లలలో రోగ నిరోధక శక్తి పెంపొందడంతో పాటు తల్లి ఆరోగ్యంగా ఉటుందని షాద్‌నగర్ ప్రాజెక్ట్ సీడీపీవో నాగమణి వివరించారు. పాపిరెడ్డిగూడలో ఐసీడీఎస్, జిమ్స్ హోమియో పతిక్ వైద్య కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, కేశంపేట, కొత్తపేట సూపర్‌వైజర్లు దివ్యాసింగ్, శమంతకమణి, కార్యదర్శి రఘు తదితరులున్నారు. కాగా, తల్లి పాలే చిన్నారులకు శ్రేష్ఠమని పులుసుమామిడి అంగన్‌వాడీ టీచర్ రాజమ్మ అన్నారు. కొందుర్గు మండలం పులుసుమామిడిలో తల్లిపాలవారోత్సవాలను నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : తల్లులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి